క్లుప్తంగా

డిగ్రీ ఐదో సెమిస్టర్‌లో ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థుల ప్రతిభ



ఎస్‌ఆర్‌ఆర్ విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్లు

పెద్దాపురం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఈ నెల 21వ తేదీన నిర్వహించిన డిగ్రీ ఐదవ సెమిస్టర్‌లో పెద్దాపురం ఎస్‌ఆర్‌ఆర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనపర్చినట్టు కళాశాల ప్రిన్సిపాల్ వీఎస్ చక్రవర్తి తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బీఎస్సీ 99 శాతం, కంప్యూటర్ విభాగంలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. ప్రతిభ కనపర్చిన విద్యార్థులను కళాశాల చైర్మన్ కేవీఆర్ మూర్తి, డైరెక్టర్లు చక్రం, మధుసూదన్, ఏసుబాబు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

అన్నవరం షోకేస్ హుండీ ఆదాయం లెక్కింపు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్ ప్లాటు ఫామ్ నంబర్ ఒకటిపై ఉన్న అన్నవరం దేవస్థానం షోకేస్ హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించారు. దేవదాయశాఖకు సామర్లకోట గ్రూపు టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి బీవీఆర్ చౌదరి పర్యవేక్షణలో లెక్కింపు జరిగింది. హుండీ ఆదాయం ద్వారా రూ.19,413 ఆదాయం వచ్చినట్టు చౌదరి తెలిపారు. అన్నవరం దేవస్థాన సిబ్బంది హుండీ ఆదాయన్ని లెక్కించారు. రైల్వే స్టేషన్ మేనేజరు ఎం రమేష్ పాల్గొన్నారు.

భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రంలో నేడు రక్తదానం

సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు విజ్ఞాన కేంద్రం అధ్యక్షుడు చల్లా మహేష్ తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు రక్తదానంలో పాల్గొన్నాలన్నారు.

సంస్కృత పరీక్షకు వంద శాతం హాజరు

సామర్లకోట: పదో తరగతి పరీక్షల్లో భాగంగా ఈనెల 17 నుంచి ప్రారంభమైన పరీక్షల్లో శనివారం సంస్కృత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. ఈ పరీక్షకు సామర్లకోట జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల, ప్రభుత్వ హైస్కూల్, బచ్చు పౌండేషన్ మున్సిపల్ హైస్కూల్, యార్లగడ్డ అక్కిరాజు మున్సిపల్ హైస్కూళ్లు మాత్రమే పరీక్ష కేంద్రాలుగా ఉన్నాయని మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య చెప్పారు. ఈ నాలుగు పరీక్షా కేంద్రాల్లో 80 మంది విద్యార్థులు సంస్కృత పరీక్ష రాయవలసి ఉండగా 80 మంది హాజరయ్యారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, హెల్త్ శిబిరాలు కొనసాగుతున్నాయని తెలిపారు.

ఉపాధి పనుల ప్రారంభం



అమరవిల్లిలో ఉపాధి పనులు ప్రారంభిస్తున్న పీడీ అడపా వెంకటలక్ష్మి

కొత్తపల్లి: గ్రామాల్లో ఉన్న ప్రజలు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి హామీ పీడీ అడపా వెంకటలక్ష్మి అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా మండలంలోని అమరవల్లి, శ్రీరాంపురంలోని చెరువుల్లో పనులను ప్రారంభించారు. ఆమె వెంట ఏపీడీ పి.వసంత మాధవి, ఎంపీడీఓ పి.రవికుమార్, ఏపీఓ కొండలరావు తదితరులు ఉన్నారు.

కొత్తపల్లి మండల గ్రామ సచివాలయ పంచాయతీ కార్యదర్శులు

కొత్తపల్లి

గ్రామ సచివాలయం	ఫోన్ నెంబర్
ఉప్పాడ- 1	9951422177
ఉప్పాడ-2	6304179606
ఉప్పాడ-3	6976476445
ఉప్పాడ-4	9494464562
కొత్తపల్లి	9949470886
కొమరగిరి-1,2	9492143912
రమణక్కపేట	8185994997
శ్రీరాంపురం	8185994997
కొండెవరం-1	9492834413
కొండెవరం-2	8886384494
మూలపేట	9133666825
నాగులపల్లి-1,2	9493288248
అమీనాబాద్ -1	8555818794
అమీనాబాద్-2	8332006890
యండపల్లి-1	9949563505
యండపల్లి-2	9391545575
గోర్స	9392881512
పొన్నాడ-1	9704397769
పొన్నాడ-2	8106235468
కుతుకుడుమిల్లి	9493982629
వాకతిప్ప	9618788873
అమరవిల్లి	9059551199
కొత్తమూలపేట	9666855856
పాత, కొత్త ఇసుకపల్లి	9154403429

కొబ్బరి.. లాభాలు ఎక్కువే మరీ..

- వేసవి తాపానికి తక్షణ ఎనర్జీ కొబ్బరి నీళ్లు
- ఏటి పట్టులో జోరుగా కొబ్బరి బొండాల వ్యాపారం
- లాభాలు ఆర్జిస్తున్న వ్యాపారస్తులు



ఏటిపట్టులో సాగవుతున్న కొబ్బరి తోటలు

పెద్దాపురం: ఎండలు మండుతున్నాయి. రోజురోజుకూ వేసవి ఉష్ణోగ్రతలు పెరగడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. మెట్ట, డివిజన్ కేంద్రమైన పెద్దాపురంలో సూర్యప్రతాపం నుంచి ఉపశమనం పొందేందుకు ప్రజలు కొబ్బరి నీళ్లు తీసుకుంటున్నారు. వేసవిలో కొబ్బరి బొండం నీళ్లు నేరుగా తాగడంవల్ల ఎంతో మేలు జరుగుతుందని, అనేక ఆరోగ్య ప్రయోజనాలున్నాయని వైద్యులు చెబుతున్నారు. కొబ్బరి నీటిలో విటమిన్లు, మినరల్స్, ఎలక్ట్రొలైట్స్, ఎంజైమ్‌లు, ఎమినోయాసిడ్లు, సైటోకిన్ అధికంగా ఉంటాయి. కొబ్బరి నీళ్ల తాగడం వల్ల శరీరంలో నష్టపోయిన ఫ్లూయిడ్స్‌ను భర్తీ చేస్తాయి. ఈ ఏడాది వేసవి ఆరంభంలోనే ఉదయం 9 గంటల నుంచే సూర్యుడు మండిపోవడంతో ఆరుబయటకు రావాలంటేనే ప్రజలు వణికిపోతున్నారు. బయటకు వచ్చిన వారు ఉష్ణతాపానికి తట్టుకునేందుకు చల్లని పానీయ దుకాణాల వద్దకు పరుగులు తీస్తున్నారు. ఎండలో బయటకు వచ్చిన వారు శీతల పానీయాలు సేవించడం కంటే కొబ్బరి నీళ్ల, ఓఆర్‌ఎస్ వంటివి సేవించడం మంచి మేలని వైద్యులు చెబుతున్నారు. వేసవిలో గుండెపోటు వంటి ప్రమాదాలను తగ్గించడంలో కొబ్బరి నీళ్లు ఎంతగానో ఉపయోగకరం.

మెట్ట, ఏటిపట్టులో జోరుగా కొబ్బరి వ్యాపారం

కొబ్బరి బొండాల వ్యాపారం మెట్ట, ఏటిపట్టు గ్రామాల్లో జోరుగా సాగుతోంది. ఏటిపట్టులో కోనసీమను తలపించే మాదిరి ఎక్కువ కొబ్బరి తోటలు ఉండడంతో అటు రైతాంగం, ఇటు వ్యాపారులకు వేసవిలో మంచి లాభాలు తెచ్చిపెడుతున్నాయి. వేసవి తాపం ప్రారంభం కావడంతో బొండాల వ్యాపారం మరింత పుంజుకుంది. ఇటీవల నియోజకవర్గ పరిధిలోని పెద్దాపురం, సామర్లకోట పట్టణాల్లో కొబ్బరి జ్యూస్ వ్యాపారం ఆరంభమైంది. కొబ్బరి నీళ్లతో పాటు లేత గుంజును తీసి, గ్లూకోజ్, నల్ల సబ్జా గింజలు కలిపి మిక్సీలో జ్యూస్ చేసి విక్రయిస్తున్నారు. కొబ్బరి నీళ్ల బొండం ధర రూ.20 నుంచి 30 రూపాయలకు విక్రయిస్తున్నారు. కొబ్బరి జ్యూస్ రూ.40 నుంచి రూ.50లకు, లీటరు కొబ్బరి నీళ్లు రూ.100 నుంచి 120 వరకు విక్రయిస్తున్నారు. కొబ్బరి నీళ్లు, జ్యూస్ తాగేందుకు యువత మక్కువ చూపుతున్నారు.

కొబ్బరి నీళ్లలో ఉండే విటమిన్లు..

కొబ్బరి నీళ్లలో ఎలక్ట్రొలైట్ పొటాషియం పుష్కలంగా ఉంటుంది. 100 మిల్లీ లీటర్ల కొబ్బరి నీళ్లల్లో 250 మిల్లీ గ్రాముల పొటాషియం, 105 మిల్లీ గ్రాములు సోడియం లభిస్తాయి. ఈ రెండు ఎలక్ట్రొలైట్ కలిసి శరీరంలో విరోచనాల వల్ల తగ్గిన ఎలక్ట్రొటిక్‌ల్స్‌ను ఉత్పత్తి చేస్తాయి. తాజా కొబ్బరి నీళ్లలో కొంచెం సీ విటమిన్ కూడా ఉంటుంది. ఆర్‌డీఏలో 2.4 మిల్లీ గ్రాముల విటమిన్ సీని అందిస్తుంది. విటమిన్ సీ నీటిలో కరిగే యాంటీ అక్సిడెంట్‌గా ఉంటుంది.



పులిమేరు నుంచి మహారాష్ట్రకు తరలివెళ్లుతున్న కొబ్బరి బొండాలు

చదలాడ నుంచి మహారాష్ట్రకు..

ఏటిపట్టు గ్రామాలైన చదలాడ, పులిమేరు గ్రామాల నుంచి కొబ్బరి బొండాలు వేల సంఖ్యలో ఇతర రాష్ట్రాలకు తరలివెళుతున్నాయి. కోనసీమ తరువాత అంతటి పేరు కలిగిన చదలాడ కొబ్బరికి మంచి గిరాకీ ఉంది. ఇక్కడ వ్యాపారులు పులిమేరు నుంచి మహారాష్ట్ర, ఒరిశా రాష్ట్రాలకు వారానికో మూడు లారీల కొబ్బరి బొండాల సరకును ఇక్కడ నుంచే రవాణా చేస్తుంటారు.

మంచి గిరాకీ



రోజు వారి కంటే వేసవి సీజన్‌లో కొబ్బరి బొండాలకు మంచి గిరాకీ ఉంది. రైతులకు సైతం వేసవి సీజన్‌లోనే ఒక్క రూపాయి అధికంగా ఇచ్చి కొనుగోలు చేస్తుంటాం. అక్కడి చెట్టు ఎక్కి కాయలు తీసేవాడికి, రైతుకు, వ్యాపారులమైన మాకు వేసవిలో ఆదాయం సమకూరుతుంది.

– కోట శ్రీనివాసరావు, కొబ్బరి బొండాల వ్యాపారి, చదలాడ, పెద్దాపురం మండలం

కొబ్బరి నీళ్లతో తక్షణ శక్తి



వేసవిలో కొబ్బరి నీళ్ల తాగడం వల్ల తక్షణ శక్తి లభిస్తుంది. వేసవి అధిక ఎండల వల్ల చెమటతో శరీరంలోని నీరు బయటకు పోతుంది. దీనివల్ల బాడీ హైడ్రేషన్ అవుతుంది. కొబ్బరి నీళ్లు సేవిచండం ద్వారా తక్షణం మనకు కావాల్సిన నీటితో పాటు విటమిన్లు కూడా లభిస్తాయి. ఏ కాలంలోనైనా కొబ్బరి నీళ్ల తాగడం ఆరోగ్యానికి చాలా మంచిది.

– డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆసుపత్రి వైద్యులు, పెద్దాపురం

మరిడమ్మ ఆలయంలో జిల్లా జడ్జి పూజలు



మరిడమ్మ అమ్మవారి ఆలయంలో వేదపండితుల ఆశీర్వచనం అందుకుంటున్న జడ్జిలు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారి ఆలయంలో కాకినాడ ఆరో జడ్జి నిఖిత ఆర్వోరా, జిల్లా జడ్జి దైవకృప శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆమె ఆలయ మర్యాదలతో స్వాగతం పలుకగా వారు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనం అందించారు.

పాడా కార్యాలయంలో రేపు గ్రీవెన్సు

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్‌ఎస్ కార్యక్రమం ఈ సోమవారం నిర్వహిస్తున్నట్లు పాడా పీడీ ఏ చైత్రవర్షిణి తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద ఉన్న పాడా కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. నియోజకవర్గస్థాయిలో నిర్వహించే ఈ కార్యక్రమానికి పిఠాపురం నియోజకవర్గానికి సంబంధించిన డివిజనల్, మండల స్థాయి అధికారులు అందరూ విధిగా హాజరు కావాలని పాడా పీడీ ఆదేశించారు. అర్జీదారులు తమ సమస్యలను వినతుల రూపంలో అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె కోరారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

- ఎంపీడీఓ హిమామహేశ్వరి
- మండలంలో ప్రపంచ జల దినోత్సవం



ఉండూరులోని ఇంకుడు గుంటను పరిశీలించిన ఎంపీడీఓ

సామర్లకోట: ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరి పిలుపునిచ్చారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఉండూరు గ్రామంలో బత్సుల గంగాధరావు పొలంలో శనివారం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంటను ఆమె పరిశీలించారు. సుమారు రెండు సెంట్ల స్థలంలో వృథాగా పోయే నీరు నిల్వ ఉండేలా ఈ ఇంకుడు గుంత ఏర్పాటు చేశారు. ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంటలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా భూమిలో తేమ శాతం పెరుగుతుందని ఆమె తెలిపారు. రైతులు సాగునీటితో పాటు ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ ప్రభాకరరావు, గ్రామ సర్పంచ్ సత్యాడి ధనలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి బుల్లియ్య కాపు, నీటి సంఘ చైర్మన్ కొప్పిరెడ్డి వీరస్వామి, గ్రామ నాయకులు కొప్పిరెడ్డి సాంబమూర్తి, సుబ్బారావు, తాతాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం

పిఠాపురం: ప్రపంచ జల దినోత్సవాన్ని పిఠాపురంలో హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ ఆధ్వర్యంలో పిఠాపురం మమత ఇంగ్లీష్ మీడియంహై స్కూల్‌లో 8, 9వ తరగతి విద్యార్థులకు నీటి పొదుపు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు షీల్డ్ ప్రశంసా పత్రాలు అందజేశారు. నీటి పొదుపు పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నందున నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని, పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం, ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం వంటి కార్యక్రమాలు విద్యార్థి దశ నుండే మొదలు కావాలని వివరించారు. కార్యక్రమంలో హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ చైర్మన్ ఎస్.జోజిబాబు, మమత ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు కొండేపూడి శంకరరావు, ఎ.రామచంద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హోప్ రూరల్ రెస్పాన్సిబుల్ సొసైటీ

జల సంరక్షణ అందరి బాధ్యత

పెద్దాపురం: భూగర్భ జలాలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చిన రాజప్ప అన్నారు. ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా రాయభూపాలపట్నం గ్రామంలో శనివారం పశుశాలకు ప్రారంభించి, నీటి గుంటకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చీకట్ల లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే చిన రాజప్ప మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెంకే సత్యవతి, ఎంపీడీఓ శ్రీలలిత, ఉపాధి హామీ ఏపీఓ సుధీర్, ఈవోపీఆర్‌డి రమణ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మాజీ ఎంపీటీసీ కల్తూరి శ్రీనివాస్, నూనె రామారావు, అధికారులు, నాయకులుపాల్గొన్నారు.

ఎన్‌సీసీ విద్యార్థులతో జల దినోత్సవ ర్యాలీ

18వ ఆంధ్రా బెటాలియన్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో శనివారం ప్రపంచ జల దినోత్సవ ర్యాలీ ఘనంగా నిర్వహించారు. స్థానిక మహారాణి కళాశాల నుంచి పుర వీధుల్లో మహారాణి కళాశాల, ప్రగతి ఇంజినీరింగ్ కళాశాల, శ్రీ ప్రకాష్ ఎన్‌సీసీ విద్యార్థులు మంచి నీటి ఆవశ్యతను తెలుపుతూ భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 18వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ మేజర్ కె.మహ్మద్ ఆశీఫ్,మహారాణి కళాశాల కరస్పాండెంట్ జాస్తి రమేష్, శ్రీ ప్రకాష్ ఎన్ఎన్ఓ ఎన్.సుబ్రహ్మణ్యం, ప్రగతి కళాశాల కేర్ టేకర్ బి.ఆదినారాయణ, బెటాలియన్ సుభేదార్ డి.గణేష్, హావల్దార్ సురేష్, బికాష్ పాల్గొన్నారు.



ఆర్‌బీపట్నంలో నీటికుంటకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

పోస్టల్ ఏటీఎం పనిచేయక ఇబ్బంది

- వినియోగదారుల ఇక్కట్లు



సామర్లకోట హెడ్ పోస్టాఫీసు వద్ద పని చేయని ఏటీఎం

సామర్లకోట: బ్యాంకులలో పొదుపునకు అనేక నిబంధనలు ఉండడంతో ప్రతి ఒక్కరూ ఎక్కువగా పోస్టల్‌లో సేవింగ్ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. నిత్యం ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండే స్టేట్ బ్యాంకులో రూ.20వేల లోపు లావాదేవీలను పూర్తిగా నిలిపి వేశారు. దాంతో స్టేట్ బ్యాంకు ఎదురుగా ఉన్న హెడ్ పోస్టాఫీసులో ప్రజలు పొదుపు చేసుకొంటూ ఖాతాలను ప్రారంభిస్తున్నారు. దాంతో పోస్టాఫీసులో వినియోగదారుల సంఖ్య పెరిగింది. పోస్టాఫీసుతో పాటు, బ్యాంకులకు చెందిన వినియోగదారులు ఎంటీఎం నుంచి నగదు పొందేలా హెడ్ పోస్టాఫీసు ఆవరణలో ఏటీఎంను ఏర్పాటు చేశారు. అయితే ఈ ఏటీఎం గత కొంత కాలంగా పని చేయక పోవడంతో వినియోగారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దీనిపై హెడ్ పోస్టాఫీసు మేనేజరు అమ్మిరాజును వివరణ కోరగా దేశ వ్యాప్తంగా నిర్వహణ అగ్రిమెంట్ పూర్తి కావడంతో వీటిని మూసివేశారని, త్వరలో ఏటీఎంలు తెరుచుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

గొల్ల మారెమ్మ తల్లి జాతర నిర్వహణపై రాజకీయం




గొల్ల మారెమ్మ తల్లి



శ్రీరాంపురంలో గొల్ల మారెమ్మ తల్లి ఆలయం

కొత్తపల్లి: అమ్మవారి జాతర నిర్వహణపై కూడా కూటమి నాయకులు రాజకీయం చేస్తున్నారు. శ్రీరాంపురంలో వేంచేసియున్న గొల్ల మారెమ్మ జాతర మహోత్సవాలను ఈనెల అమావాస్యకు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను గత 30 సంవత్సరాలుగా గ్రామస్తుల సహకారంతో ఒక కుటుంబ సభ్యులు వంశపారంపర్యంగా నిర్వహిస్తున్నారు. ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నాయకులు ఈ సంవత్సరం ఉత్సవాలను తామే నిర్వహిస్తామంటూ రాజకీయం చేస్తున్నారని పిర్ల అప్పన్న, పిర్ల గంగాధర్ అన్నారు. అమ్మవారి ఉత్సవాలపై కూడా రాజకీయం చేయడం ఎంతవరకూ సమంజసమంటూ ప్రశ్నిస్తున్నారు. దీనిపై ఇరువర్గాలకు చెందిన వారితో పోలీసులు చర్చిస్తున్నారు. దీనిపై పిఠాపురం సీఐ శ్రీనివాస్‌ను వివరణ కోరగా గ్రామంలో నిర్వహించే జాతరలో ఎంటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో జరిగేలా గ్రామస్తులతో మాట్లాడామన్నారు. జాతరలు శాంతియుతంగా చేసుకోవాలన్నారు. దీనిపై ఎటువంటి రాజకీయం చేయకూడదని అన్నారు.

శృంగార వల్లభుని సన్నిధిలో రద్దీ



ప్రత్యేక అలంకరణలో శృంగారవల్లభ స్వామి

పెద్దాపురం: మండలంలోని తొలి తిరుపతి గ్రామంలో స్వయంభువుగా వెలసిన శృంగార వల్లభస్వామి ఆలయం శనివారం వేలాదిగా వచ్చిన భక్తులతో రద్దీగా మారింది. స్వామివారిని సుమారు 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. అర్చకులు పెద్దింటి నారాయణాచార్యులు, పురుషోత్తమాచార్యులు స్వామి వారిని పూల మాలలతో విశేషంగా అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ సేవల టికెట్లు, అన్నదాన విరాళాల రూపంలో స్వామి వారికి రూ.3,22,160 ఆదాయం సమకూరిందని ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ తెలిపారు. సుమారు 4 వేల మంది భక్తులకు ప్రసాద వితరణ, అన్నదానం ఏర్పాటు చేశామన్నారు.

పిల్లలను కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి వాసంతి



జూనియర్ సివిల్ జడ్జి విజయ రామేశ్వరి

పిఠాపురం: లైంగిక దాడులు, వేధింపుల నుంచి చిన్నారులను వారి బాల్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులకే ఉందని స్థానిక 12వ అదనపు జిల్లా జడ్జి ఏ వాసంతి అన్నారు. శనివారం గోకివాడలో పోక్సో చట్టంపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ బాలలపై అత్యాచార నిరోధానికి ప్రభుత్వం ప్రత్యేక చట్టాలు చేసిందన్నారు. పోక్సో బలమైన చట్టమన్నారు. దీనిపై ప్రతి తల్లికీ, తండ్రికీ అవగాహన ఉండాలని సూచించారు. మైనర్లపై ఎవరు అసభ్యంగా, అభ్యంతరకరంగా ప్రవర్తించినా ఉపేక్షించాల్సిన అవసరం లేదన్నారు. తల్లిదండ్రులు ఫిర్యాదుపై కేసులు నమోదు అవుతాయని, బాల బాలికలను పరిరక్షిస్తారని చెప్పారు. ఈ చట్టంపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించేందుకు హైకోర్టు ఆదేశాలపై గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, న్యాయవాది కే హరనాథబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఎం.రాజారావు, ఎస్ఎం అలీ, కోశాధికారి గౌతు రాజా, న్యాయవాదులు కొశిరెడ్డి పేరాజు, ఐఏ పాషా, రేగన్ రాజు, పోలీసు, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

యు కొత్తపల్లి మండలం ఎండపల్లిలో సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, పిఠాపురం మండలం చిత్రాడలో జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయ రామేశ్వరి, గొల్లప్రోలు మండలం తాటిపర్తిలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి వి.వెంకట అపర్ణ న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహించారు. పోక్సో చట్టంతో పాటూ ప్రపంచ జలదినోత్సవంపై వారు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన తప్పనిసరి

కాకినాడ లీగల్: పోక్సో,వివిధ చట్టాలపై అవగాహన అవసరమని ఉండాలని కాకినాడ పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి కె.శ్రీదేవి అన్నారు. శనివారం స్థానికి పీఆర్ కళాశాలలో వివిధ చట్టాలపై న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీదేవి మాట్లాడుతూ పోక్సో చట్టంతోపాటు వివిధ చట్టాలపై విద్యార్థులు అవగాహన ఉండాలన్నారు. తల్లిదండ్రుల ఆశలను నిజం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందన్నారు. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఇంట్లో వాళ్లకు, పోలీసులకు తెలియజేయాలన్నారు. న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

కరప: మహిళలు, బాలికలకు భద్రత కల్పించేందుకు ఎన్నో చట్టాలున్నాయని, వాటిని తెలుసుకోవాలని కాకినాడ రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.ప్రసన్నలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక నక్కా సూర్యనారాయణమూర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం విద్యార్థినులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పోక్సో, ఇతర చట్టాల గురించి వివరించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రెండో అదనపు సివిల్ జడ్జ్ ప్రసన్న లక్ష్మి మాట్లాడుతూ చిన్న వయసులోనే పిల్లల్లో పెరుగుతున్న నేర ప్రవృత్తి, పిల్లల్లో సినిమాలు, సోషల్ మీడియా ప్రభావంతో గాడి తప్పుతున్న బాల్యం గురించి, పోక్సో, వివిధ చట్టాల గురించి చెప్పారు. కరప ఎస్ఐ టి.సునీత మాట్లాడుతూ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు చెప్పినమాట విని, బాగా చదువుకుని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కొత్తపల్లి: లిఫ్టు ప్రమాదంలో గాయపడిన ఒక వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందడంపై కేసు నమోదు చేసినట్లు శనివారం పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... ఉప్పాడ వీవర్స్ కాలనీలో ఆసపు సుబ్రహ్మణ్యం(64) తన ఇంటికి ఎదురుగా ఉన్న లాడ్జికి పని నిమిత్తం ఈనెల 11న వెళ్లాడు. తిరిగి కిందకి వస్తుండగా లిఫ్ట్ ఎక్కాడు. లిఫ్ట్ లేకుండా తలుపులు తెరిచి ఉండడంతో గమనించకుండా లిఫ్ట్ ఉందని వెళ్లాడు దీంతో ప్రమాదవశాత్తు పై నుంచి కిందకు పడిపోయారు. తీవ్ర గాయాలైన సుబ్రహ్మణ్యాన్ని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స అందించారు. మెరుగైన చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఈ నెల 20వ తేదీన మృతి చెందినట్టు తెలిపారు. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమెదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. లిఫ్ట్ మరమ్మతులకు గురికావడం దానిని లాడ్జి నిర్వాహకులు పట్టించుకోకపోవడం వలనే ప్రమాదం జరిగిందని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా జపయజ్ఞ పారాయణ

బోట్‌క్లబ్: స్థానిక భోగిగణపతి పీఠంలో శనివారం సుప్రభాత వేళలో వజ్రకవచ స్తోత్రంతో వేంకటేశ్వరస్వామి వారికి 78వ జపయజ్ఞ పారాయణను శ్రీవారి సేవకులు నిర్వహించారు. పీఠం వ్యవస్థాపకులు దూసర్లపూడి రమణరాజు మాట్లాడుతూ తిరుమల వేంకటేశ్వర స్వామి వారికి 14వ శతాబ్దంలో తొండమాన్ చక్రవర్తి బంగారు తులసిదళాలు, 15వ శతాబ్దంలో శ్రీకృష్ణదేవ రాయలు వజ్రకవచ ఆభరణాలతో పూజా కైంకర్యాలు చేయించి ధన్యులయ్యారన్నారు శ్రీవారి పారాయణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.